సాక్షి మెదక్

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



సొంత భవనాలు కరువు

అల్లాదుర్గం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి.


వివరాలు 8లో ▸



మండే ఎండ.. చల్లని అండ

భానుడి ప్రతాపం నుంచి తట్టుకుకోవడానికి ప్రజలు మార్కెట్‌లో పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు తీసుకుంటున్నారు.

వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

బండ్ల ఊరేగింపు



శ్రీ అనంత పద్మానాభస్వామి గుట్ట బండికి ట్రాక్టర్ జత చేసి ఊరేగిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): ఉగాది ఉత్సవాలలో భాగంగా చిన్నశంకరంపేటలోని శ్రీ అనంతపద్మానాభ స్వామి గుట్ట వద్ద మంగళవారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ప్రతి యేటా గ్రామస్తులు అనంతపద్మనాభస్వామి గుట్ట వద్ద ఉగాది సందర్భంగా ఈ జాతర నిర్వహిస్తారు. ఆలయాల వద్ద వతన్‌దారులు వరుస క్రమంలో బండ్లను ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహిస్తారు. ఇదే క్రమంలో చిన్నశంకరంపేటలో కూడా పటేల్, పట్వారీల తర్వాతనే ఇతర కులపెద్దలు తమ వంతు బండ్లను తిప్పుతారు. అయితే పటేల్ వతన్ ఉన్న వారి గుమ్మటాల బండికి ట్రాక్టర్ ఇంజన్‌తో బండి ఊరేగింపు నిర్వహించారు. తమ వతన్ బండికి ట్రాక్టర్ ఇంజన్‌ను ఏర్పాటు చేసి ముందు వరుసలో తమ వతన్‌ను కాపాడుకున్నారు. బండికి ట్రాక్టర్ ఇంజన్‌ను జతచేసి ఎడ్లబండ్ల వరుసలో తిప్పటం చర్చనీయాంశమైంది.

మెదక్ బీజేపీదే

ఆ పార్టీ అభ్యర్థి రఘునందన్ ధీమా



బీఆర్ఎస్ నాయకుడు సంజీవరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునందన్

రామాయంపేట(మెదక్): మెదక్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావు ధీమా వ్యక్తంచేశారు. రామాయంపేట మండలం కోనాపూర్‌లో మంగళవారం రాత్రి బీఆర్ఎస్‌కు చెందిన కొందరు కార్యకర్తలను బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో పార్టీ పటిష్టంగా ఉందని, కార్యకర్తలు ఐకమత్యంతో కలిసి పని చేస్తే విజయం మనదేనని చెప్పారు. మూడోసారి మోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయమన్నారు.

బట్టమ్మతల్లికి బోనాలు



కౌడిపల్లి: బోనాలతో ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కూకుట్లపల్లిలో బట్టమ్మదేవి జాతర ఘనంగా జరిగింది. ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి గ్రామస్తులు అమ్మవారికి బండ్లను ఊరేగించి, బోనాలు, గండదీపం తీసి మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా, బట్టమ్మదేవిని ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ సుజాత ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

రాజ్యాంగ రక్షణ కోసం పోరాటం

సంగారెడ్డి అర్బన్: రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా పోరాటం చేద్దామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ పిలుపునిచ్చారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్, పూలే ఆశయ సాధనకు యువత కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే తలంబ్రాలు

నారాయణఖేడ్: భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు ఇంటివద్దకు చేర్చే కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టిందని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, పీఆర్‌ఓ పాండు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.151 చెల్లించి బుక్ చేసుకుంటే తలంబ్రాలు ఇంఆ వద్దకు తీసుకొచ్చి అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఖేడ్ ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు 9441071134, 9959223170, 9989032336 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రోదం ఎక్కువే..



పంచాంగ పఠనం చేస్తున్న పూజారి వైద్య శ్రీనివాస్

- క్రోధినామ సంవత్సరంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ధర్మంవైపు నిలబడాలి
- ఉగాది సందర్భంగా పండితుల పంచాంగ శ్రవణం



శ్రీ కోదండ రామాలయంలో పంచంగం వింటున్న భక్తులు

మెదక్‌జోన్/మెదక్ మున్సిపాలిటీ: క్రోధి నామసంవత్సరంలో మనం ఎంత ప్రశాంతంగా ఉన్నప్పటికీ కొంత క్రోదంగా ఉంటుందని వేదపండితులు పంచాంగం వినిపించారు. పరిస్థితులు ఎలా ఉన్నా.. ప్రతి ఒక్కరూ ధర్మంవైపు నడవాలని సూచించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మెదక్ పట్టణంలోని శ్రీ అయ్యప్ప ఆలయంలో వేద పండితులు రాజు పంతులు, శ్రీ కోదండ రామాలయంలో మధుసూదనాచార్యులు, శ్రీ వేంకటేశ్వరాలయంలో వైద్యశ్రీనివాస్ పంచాంగం శ్రవణం గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రోధి నామసంవత్సరంలో అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున దేశభద్రతకు, శాంతికోసం ధర్మంవైపు నిలబడాలని పిలుపునిచ్చారు.

సమృద్ధిగా ఆరుతడి పంటలు

క్రోధినామ సంవత్సరంలో వర్షాలు మధ్యస్తంగా కురుస్తాయని పూజారి వైద్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈసారి ఆరుతడి పంటలైన కందులు, చెరకు, మిర్చి, పత్తి, వేరుశనగ సమృద్ధిగా పండుతాయని, ఆదాయం కూడా బాగా ఉంటుందన్నారు. మెదక్ జిల్లాకు సింహరాశి వస్తుందని, ఈ సంవత్సరం పట్టణం నవీకరణ అయ్యే అవకాశం ఉందన్నారు. ఉద్యానవనాలు, క్రీడాప్రాంగణాలు పెరుగుతాయని, అధికారులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వస్తోందని వైద్యశ్రీనివాస్ తెలిపారు. రాజకీయాల్లో యువనాయకత్వం పెరుగుతోందని, జాతీయరహదారి, రైల్వే లైన్‌లో అభివృద్ధి ఉంటుందన్నారు. వైద్యరంగంలో ఒడిదొడుకులు సంభవించే అవకాశం ఉందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఉత్సాహంతో పనిచేస్తాయని చెప్పారు.

బ్రాండెడ్ స్టాక్

మండు టెండల్లో బుసబుస పొంగే చల్లని బీరు తాగి ఉపశమనం పొందాలనుకునే మందుబాబులకు కష్టకాలమొచ్చింది. వైన్ షాపుల్లో బ్రాండెడ్ బీర్లు దొరకని పరిస్థితి నెలకొంది. మద్యం డిపోలు ప్రధాన బ్రాండ్ల బీర్లపై రేషన్ విధించడంతో అటు వైన్‌షాప్ యజమానులు.. ఇటు కొనుగోలు దార్లు నిరుత్సాహానికి గురవుతున్నారు. దీంతో మద్యం ప్రియులు దొరికిన దానితోనే సరి పెట్టుకుంటున్నారు. ఒక్కో షాపునకు ఇండెక్స్ ఆధారంగా 20 నుంచి 25 కేసులు ఇస్తుండగా.. ఇది ఒక రోజుకు కూడా సరిపోదని మద్యం వ్యాపారులు పెదవి విరుస్తున్నారు. – పాపన్నపేట(మెదక్)



పాపన్నపేట మండలంలోని ఓ వైన్ షాపు

మద్యం ప్రియులకు దొరకని బీర్లు

- వేసవి కాలంలో ప్రధాన బ్రాండ్ల కొరత
- నాలుగు నెలల్లోనే 2,96,977 కేసులు అమ్మకం
- రూ.206.71 కోట్ల విక్రయాలు
- జిల్లాలో 49 వైన్ షాపులు, ఐదు బార్లు

జిల్లాలో మెదక్, రామాయంపేట, నర్సాపూర్‌లో ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 49 వైన్ షాపులు, ఐదు బార్లు ఉన్నాయి. ఈయేడు ఎక్సైజ్ సంవత్సరం డిసెంబర్‌లో ప్రారంభమైంది. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో కొంత మేర మద్యం అమ్మకాలు పెరిగాయి. గతేడాది డిసెంబర్ నుంచి మార్చి వరకు రూ.194.68 కోట్ల మద్యం విక్రయాలు జరుగగా, ఈసారి నాలుగు నెలల కాలంలో రూ.206.71 కోట్ల విక్రయాలు జరిగాయి.

మందు బాబుల పరేషాన్..

వేసవి ఎండలు ముదరడంతో మద్యం ప్రియులు ఎక్కువగా బీర్లు తాగడానికి మొగ్గు చూపుతున్నారు. కానీ ప్రస్తుతం నీటి కొరత, బీర్ల ఉత్పత్తి షరతులు తదితర కారణాల వల్ల బీర్ల కొరత ఏర్పడింది. అలాగే బీరు కాలపరిమితి 6 నెలలు ఉండటంతో ఎక్కువ కాలం నిల్వ ఉంచలేని పరిస్థితి. గతేడాది నాలుగు నెలల కాలంలో 2,68,763 కేసులు అమ్మగా, ఈయేడు మార్చి 31 వరకు 2,96,977 కేసులు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం సాధారణ బ్రాండ్లు లభిస్తున్నప్పటికీ వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడే బ్రాండ్లు దొరకడం లేదు. దీంతో ఇండెక్స్‌కు అనుగుణంగా 20 నుంచి 25 కేసులు లభ్యతను బట్టి ఇస్తున్నారు. అలాగే సామాన్యుడికి అందుబాటు ధర కలిగి, నిత్యం ఎక్కువగా అమ్ముడు పోయే ఓ బ్రాండ్ లిక్కర్ కొరత కారణంగా దానికి కూడా రేషన్ విధించినట్లు మద్యం వ్యాపారులు తెలిపారు.

ప్రధాన బ్రాండ్ల కొరత

ప్రధాన బ్రాండ్ల బీరు కొరత ఉంది.అందువల్ల ఇండెక్స్‌కు అనుగుణంగా రేషన్ విధించాం. ఉన్నంతలో కొరత అధిగమించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వేసవి కాలం కావడంతో కొరత ఏర్పడింది. సాధారణ రోజుల్లో ఇంత ఉండదు.

– నాగేశ్వర్ రావు, డీఎం, ఐఎంఎల్ డిపో

పెరిగిన 10.50 శాతం

ఎక్సైజ్ స్టేషన్ల వారీగా మద్యం అమ్మకాలు చూస్తే గతేడాది నాలుగు నెలలు (డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి) నర్సాపూర్‌లో రూ.7,172.2 లక్షలు విక్రయాలు జరుగగా ఈసారి నాలుగు నెలలు రూ.7,888.2 లక్షలు, మెదక్‌లో గతేడాది రూ.6,847.6 లక్షలు ఉండగా, ఈసారి రూ.6,902.4 లక్షలు, రామాయంపేటలో గతేడాది రూ.5,447.9 లక్షలు కాగా, ఈసారి రూ.5,880.2 లక్షలు విక్రయించాయి. మొత్తం మీద గతేడాది నాలుగు నెలలతో పోలిస్తే ఈసారి జిల్లా వ్యాప్తంగా 6.18 శాతం మద్యం విక్రయాలు వృద్ధి చెందాయి. అలాగే గతేడాది బీర్లతో పోలిస్తే ఈ నాలుగు నెలల్లోనే బీర్ల వినియోగం 10.50 శాతం పెరిగింది. ప్రతీయేటా వేసవి కాలంలో బీరు సరఫరాలో కొరత ఏర్పడుతుంది. డిమాండ్‌కనుగుణంగా సరఫరా లేక పోవడంతో ప్రధాన బ్రాండ్లపై రేషన్ విధిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

చివరికి నీరేది?



వరి పంట

- నీరందక ఆయకట్టు రైతుల ఇబ్బందులు
- ఎంఎన్ కెనాల్ నుంచి రెండు విడతలు ఇవ్వాలని వేడుకోలు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోట మీదుగా ఉన్న ఎంఎన్ కెనాల్ పరివాహక ప్రాంతంలోని రైతులకు సాగునీరందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. కొన్ని రోజులుగా సాగునీరు బాగానే అందించినప్పటికీ.. ప్రస్తుతం కాలువ వెంట మోటార్లు పెట్టి నీటిని తోడేస్తుండడంతో చివరన ఉన్న తమ పంటలకు రావడంలేదని జక్కన్నపేట, ముత్తాయిపల్లి, సర్దన, ఫరీద్‌పూర్, కూచన్‌పల్లి రైలు ఆందోళన చెందుతున్నారు. తమ పంటలు చివరి దశలో ఉండగా మరో రెండు విడతలు సాగునీరందిస్తే గట్టెక్కుతాయని పేర్కొంటున్నారు. లేకుంటే చేతికొచ్చే పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగూరు నుంచి ఘణపూర్ ఎంఎన్ కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం

రైతులకు ఇప్పటికే అవసరమైన సాగునీటిని విడతల వారీగా సరఫరా చేశాం. ప్రస్తుతం రైతులు కొందరు కెనాల్ కాలువ వెంట బోర్లు పెట్టి నీటిని ఎత్తిపోయడం ద్వారా చివరన ఉన్న రైతులకు నీరందడం లేదు. తమ సిబ్బందితో పర్యవేక్షించి రైతులకు సకాలంలో నీరందించేలా చూస్తాం.

– శ్రీహరి, ఇరిగేషన్ అధికారి

ఆదాయం 2, ఖర్చులు 14 శాతం

కొమురవెల్లి(సిద్దిపేట): తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారికి నిత్యకల్యాణం, ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన, ప్రసాద వితరణ అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. క్రోధినామ సంవత్సరంలో స్వామి వారి ఆదాయం 02, ఖర్చులు 14 శాతం ఉంటాయని పంచాంగ శ్రవణంలో వీరశైవ ఆగమ పండితులు ఆనందయ్యస్వామి, సిద్దేశ్వర్, వీరేశలింగం చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఏఈఓలు శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.



కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు

తూకంపై తకరారు..!

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం రాశులు
- అకాల వర్షాలు వస్తే నష్టం జరుగుతుందని రైతుల ఆందోళన

మెదక్‌జోన్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంకా తూకం ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పక్షం రోజులుగా వరికోతలు జోరందుకున్నాయి. ఫలితంగా కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం తరలివస్తోంది. అయితే.. అధికారులు తూకాలకు తగు ఏర్పాట్లు చేయడం లేదు. జిల్లాలో ఈ యాసంగిలో 2.63 లక్షల ఎకరాలలో వరిపంటలను సాగు చేశారు. ఇందుకుగాను 3.99 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అన్నదాతలు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించి రాశులు పోస్తున్నారు. కొన్ని కేంద్రాలలో ధాన్యం పట్టడంలేదు. ఎక్కడ చూసినా గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిసిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. త్వరగా తూకం ప్రారంభించాలని వారు కోరుతున్నారు.



శమ్నాపూర్ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం

వారం రోజుల్లో ప్రారంభిస్తాం: అదనపు కలెక్టర్

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 410 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. మరో వారం రోజుల్లో అన్ని కేంద్రాలలో తూకం ప్రారంభిస్తాం. ధాన్యంలో తాలుపొల్లు లేకుండా చూడాలి. తేమశాతం 17కు మించరాదు. మూడు వేల టార్పాలిన్లను అందుబాటులో ఉంచాం. 30 లక్షల గన్నీబస్తాలు సైతం సిద్ధంగా ఉన్నాయి.

సరిహద్దులు దాటుతున్న సబ్సిడీ బియ్యం

యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

- గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం సేకరిస్తున్న దళారులు
- కిలో రూ.10కి కొని రూ.25కు విక్రయం
- చక్రం తిప్పుతున్న కొందరు డీలర్లు, సివిల్ సప్లయి అధికారి..!

సబ్సిడీ బియ్యం సరిహద్దులు దాటుతోంది. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌బియ్యం.. కొందరు డీలర్లు, ఓ అధికారి నిర్వాకం వల్ల యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలుతుందన్న విమర్శలున్నాయి. స్థానికంగా తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాల్లో ఉన్న కోళ్ల ఫారాలకు సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించారు. అక్కడక్కడ అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సైతం పట్టుకున్నారు.

– రామాయంపేట(మెదక్)

మెదక్ జిల్లా, హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం కిలో రూ.10లకు దళారులు కొంటున్నారు. వారు రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తున్నారు. ఇది లాభసాటి బేరంగా ఎంచుకొని.. గ్రామగ్రామాన ద్విచక్ర వాహనాలపై ఇంటింటికి తిరిగి కొంటున్నారు. వరి సాగు చేస్తున్న రైతులు చాలా మంది తాము పండించేవే బియ్యంగా మార్చి వాడుకుంటున్నారు. వీరు ఆరోగ్య భద్రతా కార్డుపై తీసుకునే రేషన్ బియ్యాన్ని మాత్రం విక్రయిస్తున్నారు. అచ్చంగా ఆరోగ్య భద్రతా కార్డుదారులు కలిగిన కొందరు మాత్రం బియ్యాన్ని తీసుకోకుండా రేషన్ దుకాణాల్లో వేలిముద్ర వేసి డీలర్లకే విక్రయిస్తున్నారు. ఇలా రైతులు, సాధారణ ప్రజలు విక్రయించేవి కాస్త అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయి. ఇప్పటికే పౌరసరఫరాల శాఖ అధికారులు వాటిని ఎవరైనా అమ్మినా కొన్నా సదరు వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు. ఇప్పటికైనా రేషన్ అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ ఘటనలు నిదర్శనం



తూప్రాన్ వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న ట్రక్

- నాలుగు రోజుల వ్యవధిలోనే జిల్లాలో అక్రమంగా తరలుతున్న 750 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులు పట్టుకున్నారు. ఇందులో చాలావరకు మహారాష్ట్ర, గుజరాత్, కోళ్ల ఫారాలకు తరలుతున్నట్లు గుర్తించారు.
- మూడు రోజులక్రితం తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై భారీ ట్రక్‌లో తరలుతున్న 422 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అలాగే రామాయంపేట వద్ద జాతీయ రహదారిపై లారీలో తరలుతున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేశారు.
- మారుమూల గ్రామాల్లో ఉన్న కొన్ని రైసు మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి రిసైక్లింగ్ చేసి మళ్లీ సీఎంఆర్‌కు సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఇటీవల పలు రైసుమిల్లులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం



రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ తరలకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా పౌరసరఫరా శాఖతో పాటు పోలీసులు సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నారు. ఏ మాత్రం సమాచారం వచ్చినా వెంటనే దాడులు చేసి పట్టుకుంటున్నాం. ఇటీవల ఎక్కువగా గుజరాత్, మహారాష్ట్రకు కొందరు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తేలింది. బియ్యం అక్రమ రవాణా విషయమై సమాచారమిస్తే వారి వివరాలు రహస్యంగా ఉంచుతాం.

– బ్రహ్మారావు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి